జాడ లేని ప్రాసెసింగ్ కేంద్రాలు!


తెరుచుకోని వన్‌ధన్ వికాస్ కేంద్రం జీడి ప్రాసెసింగ్ యూనిట్

- కానరాని జీడి, చింతపండు యూనిట్లు
- సీజన్ ఆరంభమైన పత్తాలేని కేంద్రాలు
- సంతల్లోని వ్యాపారులకే విక్రయాలు
- వన్‌ధన్ వికాస్ కేంద్రాల పనితీరు అంతంతమాత్రమే
- వృథాగా యంత్రాలు

సీతంపేట: మహిళా సంఘాలను లక్షాధికారులను చేసి సభ్యుల జీవన ప్రమాణాలు మెరుగు పరిచి వారిని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వ ప్రకటనలు మాటలకే పరిమిత మయ్యాయి. ఈ సీజన్‌లో గిరిజన ప్రధాన ఆదాయ వనరులు చింతపండు, జీడి పంటలు. వీటిని పండించే రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి, వెలుగు ద్వారా మార్కెటింగ్ కేంద్రాలను నెలకొల్పి తద్వారా ఆదాయ వనరులు మహిళా సంఘాలకు పెంచేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. సీజన్‌లో చింతపండు కొనుగోలు చేసి ప్రోసెస్ చేసి నాణ్యమైన చింతపండును పిక్క తీసి ప్యాకెట్ల రూపంలో తయారు చేసి వసతిగృహాలు, ఇతర మార్కెటింగ్ కేంద్రాలకు విక్రయించాలనేది ఉద్దేశం. గతంలో వీటికి సంబంధించిన యంత్రాలను కూడా కొనుగోలు చేశారు. భవన సదుపాయాలు ఏర్పాటు చేసి అక్కడ యంత్రాలను ఏర్పాటు చేశారు. జీడి ప్రోసెసింగ్ కేంద్రాలను శంభాం, జిల్లేడుపాడు, సీతంపేటలలో ఏర్పాటు చేశారు. వాటికి కూడా పెద్దపెద్ద యంత్రాలను సమకూర్చారు. జీడిని సైతం ప్రోసెస్ చేసి పిక్కలు తీసి ప్యాకెట్ల రూపంలో విక్రయించడానికి ప్రణాళికలు రూపొందించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. సరైన మార్కెట్ లేకపోవడంతో మూల పడేశారు. పర్యవేక్షణ లేకపోవడంతో మార్కెటింగ్ కేంద్రాలు మూసి వేశారు

పత్తాలేని వన్‌ధన్ వికాస్ కేంద్రాలు

వన్‌ధన్ వికాస కేంద్రాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో సీతంపేట, మండ, తదితర చోట్ల ఏర్పాటు చేశారు. సీతంపేట ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జీడి, చింతపండు ప్రోసెసింగ్ యూనిట్లు ఈ సీజన్‌లో ఇప్పటి వరకు తెరుచుకోలేదు. ఏజెన్సీలో చింత పంట సుమారు 1500ల ఎకరాల్లో సాగవుతుంది. కొద్ది రోజుల కిందట సీజన్ ఆరంభమైంది. కిలో చింతపండు రూ.50 వరకు గిరిజనులు విక్రయిస్తున్నారు. ఈ చింతపండును పిక్కతీసి ప్రోసెస్ చేసి ప్యాకెట్ల రూపంలో తయారు చేసి ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల వసతి గృహాలకు సరఫరా చేయాలని గతంలో నిర్ణయించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. జీడి పంట 10 వేల ఎకరాల్లో పండుతుంది. జీడి పిక్కలు కొనుగోలు చేసి వాటిని ప్రోసెస్ చేసి జీడి పప్పును ప్యాకెట్ల రూపంలో తయారు చేసి విక్రయించాలి. ఇప్పుడు సీజన్ ఆరంభమైనా ఫలితం లేదు. రైతులు బయట మార్కెట్లో దళారీ వ్యాపారులకే విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఉంది.

యాక్షన్ ప్లాన్ తయారు చేస్తున్నాం

పది టన్నుల వరకు జీడి పిక్కలు సేకరించి ప్రోసెస్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కూడా ప్రోసెస్ చేసి విక్రయించడం జరిగింది. డైరెక్ట్ మార్కెటింగ్, ప్రోసెసింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం. చింత పండు కూడా ప్రోక్యూర్ చేయమని చెప్పాం. రూ.3లక్షలతో ఎఫ్‌పీవో ద్వారా కోల్డ్ స్టోరేజీ యూనిట్ పెట్టడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. – సన్యాసిరావు, వెలుగు ఏపీడీ


వారపు సంతలో వ్యాపారులు కొనుగోలు చేసిన చింతపండు, జీడి పిక్కలు (ఫైల్)

మండుటెండలో నడ(ర)క యాతన!



ఏజెన్సీలో మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం ఉన్నప్పటికీ రవాణా సౌకర్యాలు మృగ్యమౌతుండడంతో నడకయాతన తప్పడం లేదు. కొత్తూరు నుంచి సీతంపేట మండలంలోని పూతికవలసకు తారు రోడ్డు సౌకర్యం ఉంది. అయితే ఆ ప్రాంతంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. గతంలో పల్లెవెలుగు బస్సును నడిపినప్పటికీ ప్రయాణికులు కొరత సాకుతో బస్సులు తిప్పడం నిలిపివేశారు. ఆటోలు వంటి వాటిని ఆశ్రయిస్తున్నారు. అవి కూడా సకాలంలో అందుబాటులో లేకపోతే నడకే శరణ్యం.

– సీతంపేట

క్లుప్తంగా

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం..

సాక్షి ఎఫెక్ట్...

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): 'గిరిజనం గొంతెండుతోంది' శీర్షిక పేరిట కురుపాం మండలంలోని వనలబల్లేరు పంచాయతీలోని బుడ్డిగాడుగూడ, ఆగంగూడ, చాపరాయిగూడ గ్రామాల్లోని గిరిజనులు తాగునీటి కోసం పడుతున్న అవస్థలపై ఈ నెల 8వ తేదీన సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ మేరకు ఎంపీడీవో జె.ఉమమహేశ్వరి స్పందించారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు మంగళవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో రెండు రోజుల్లో బోర్లు తవ్వించి, తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తామన్నారు. బుడ్డిగాడుగూడలో తాగునీటి సదుపాయం కల్పించేందుకు జల్‌జీవన్ మిషన్ కింద రూ.20 లక్షలు మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన


ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సిబ్బంది

సీతంపేట: సీతంపేటలో ఆటో డ్రైవర్లకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.వేణుగోపాలరావు, సహాయ అధికారి జి.నవీన్‌కుమార్ ప్రమాదాల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. విధిగా నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పక్కాగా పౌష్టికాహారం అందివ్వాలి


ర్యాలీలో ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

గుమ్మలక్ష్మీపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందివ్వాల్సిన పౌష్టికాహారం పక్కాగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని భద్రగిరిలో మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ నెల 22వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ఏ సమయంలో ఏ విధమైన ఆహారం తీసుకుంటే తల్లీబిడ్డ సురక్షితమన్న విషయాలు తెలియజేయాలన్నారు.

'ఎన్‌ఎంఎంఎస్'కు విద్యార్థి ఎంపిక




గరుగుబిల్లి: ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎస్.హాసిని ఎంపికైనట్లు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు జి.సత్యనారాయణ మంగళవారం వెల్లడించారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆమెకు ఏటా రూ.12 వేలు ఆర్థికసాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. సదరు విద్యార్థినికి ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శిలువ మార్గం


నేరడి-బీలో శిలువ మార్గంలో క్రైస్తవ దీక్షాపరులు

భామిని: మండలంలోని నేరడి బీలో క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో శిలువ యాత్ర మంగళవారం నిర్వహించారు. శిలువను మోస్తూ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. బైబిల్ వ్యాఖ్యాన్ని బత్తిలి చర్చి ఫాదర్ బి.సంజీవరావు తెలిపారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు ఆలపించారు.

చర్చిల సందర్శన


రెల్ల గ్రామ చర్చిని సందర్శించిన క్రైస్తవ సోదరులు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని చర్చిలను పి.లేవిడి విచారణకు చెందిన క్రైస్తవ సోదరులు మంగళవారం సందర్శించారు. ప్రస్తుతం తపస్సుకాలం నడుస్తున్నందున ఆయా మండలాల్లోని ఎస్‌కే పాడు, గుమ్మలక్ష్మీపురం, రెల్ల, ధూళికుప్ప, కొండబారిడి, గుమ్మ, కాకితాడ తదితర గ్రామాల్లోని దేవాలయాలను సందర్శించి, ఏసుక్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు వారు తెలిపారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలి


వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా నివారణ అధికారి మణి

జియ్యమ్మవలస రూరల్: వేసవి ఎండల నేపథ్యంలో ప్రతిఒక్కరూ వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ వై.మణి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశ డే కార్యక్రమాన్ని మంగళవారం తనిఖీ చేసిన ఆమె.. ప్రజలకు సూచించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంట్లో, ఇళ్ల ముంగిట చెత్తాచెదారం, అనవసర నీటి నిల్వలు ఉండకుండా చూసేలా గ్రామస్తులను చైతన్యం చేయాలని తెలిపారు. అలాగే ప్రజల ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. ప్రస్తుతం ఎండలు బాగా ఉన్నందున ఎండల్లో తిరిగి వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు సూచనలు చేయాలన్నారు. అవసరమైన వారికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని తెలిపారు. ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే చేతిన గొడుగు, వాటర్‌బాటిల్ పట్టుకుని వెళ్లాలన్నారు.

అలరించిన నగర సంకీర్తన


దళాయివలసలో భక్తుల నగర సంకీర్తన

గరుగుబిల్లి: మండలంలోని దళాయివలస, సీతారాంపురం, కొంకిడివరం గ్రామాల్లో సమరసత సేవా సమితి, తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)ల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన నగర సంకీర్తన అలరించింది. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భక్తులు శ్రీరాముడిని స్తుతిస్తూ చేసిన గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. సమరసత సేవా సమితి నిర్వాహకులు జి.చినతిరుపతిరావు, శకుంతల, ఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


ఆశ కార్యకర్తలకు సూచనలిస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్మోహనరావు

కొమరాడ: గ్రామీణులంతా వ్యాధుల బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని కేఆర్‌బీ పురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. ఆయా ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న సేవలను రోగులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే ల్యాబ్‌లో వివిధ పరీక్షల నిర్ధారణ రిపోర్టులను చూసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని, ఇక్కడికి వచ్చే ప్రతిరోగి ఆరోగ్యం నయం కావాలన్నారు. అనంతరం జరిగిన ఆశ డే కార్యక్రమంలో పాల్గొని, ఆశ కార్యకర్తలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన దిశానిర్దేశం చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, వేసవి ఎండలతో నీరశించిపోతున్న గ్రామీణులకు తక్షణ ఉపశమనం కలిగించే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు అరుణ్‌కుమార్, శ్యామల్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలతోనే రాజ్యాంగ పరిరక్షణ

గుమ్మలక్ష్మీపురం:


కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతున్న సీపీఐ నాయకులు

ప్రజా ఉద్యమాల ద్వారానే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమని, ప్రస్తుతం కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి ప్రమాదంలో పడిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై మండల కేంద్రంలో ఆయన మంగళవారం విస్తృత ప్రచారం చేపట్టారు. కేంద్రంలోని మోదీ సర్కారు.. ఏ విధంగా ఓ పథకం ప్రకారం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుందో ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి దేశంలో మతోన్మాదం రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. నిత్యావసరాలు, పెట్రోలు, గ్యాస్‌ల ధరలు పెంచేయడంతో పాటు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వకుండా కార్పొరేట్ శక్తులకు అండగా నిలవడం దారుణమైన చర్యన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను అందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య, నాయకులు కుండంగి లింగరాజు, మండంగి సింగన్న తదితరులు పాల్గొన్నారు.

బియ్యం ఇవ్వడం లేదయ్యా...!



తెలుపు రేషన్‌కార్డు ఉన్నా రెండు నెలలుగా బియ్యం ఇవ్వడంలేదంటూ కురుపాం మండలం తిత్తిరి పంచాయతీ టొంపలపాడు గ్రామానికి చెందిన ఊయక సుమన్ కుటుంబం ఆవేదన వ్యక్తంచేస్తోంది. మార్చినెలలో బియ్యం ఇవ్వకపోవడంతో రేషన్ డీలర్‌ను సంప్రదిస్తే బియ్యం రాలేదని చెప్పారన్నారు. మార్చి 17న కురుపాం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వీఆర్వో, డీటీలను సంప్రదించగా.. పరిశీలిస్తామని చెప్పారని, మరలా 19, 20వ తేదీల్లో కూడా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అడిగితే ఎవ్వరూ స్పందించ లేదని, 21వ తేదీన వీఆర్వోకు ఫోన్ చేసి గ్రీవెన్స్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తామని చెప్పగా వెళ్లొద్దని.. పరిష్కరిస్తామని చెప్పినా పట్టించుకోలేదన్నారు. మళ్లీ వీఆర్వోను సంప్రదించగా ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోవాలంటూ కోపగించుకున్నారని, ఈ నెల 3వ తేదీన డీలర్ వద్దకు వెళ్లి అడిగితే ఈ నెలలో కూడా మా కార్డుకు బియ్యం రాలేదని చెప్పారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రెండు నెలల బియ్యంను ఇప్పించి పస్తుల జీవనాన్ని తప్పించాలంటూ గిరిజన కుటుంబం వేడుకుంటోంది.

– గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

సీతంపేట: గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఏ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉందో సర్వే చేసి ఆ గ్రామాలకు అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై దాడి

పాలకొండ: నాగావళి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ర్యాంపులపై రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం దాడి చేశారు. ఈ మేరకు మండలంలోని చిన్న మంగళాపురం, పెద్ద మంగళాపురం గ్రామాల వద్ద ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు అందిన సమాచారం మేరకు తహసీల్దార్ బాలమురళీకృష్ణ, ఎస్సై ప్రయోగ మూర్తిలు పరిశీలించి సంకిలి వద్ద ఉన్న వంతెన సమీపంలో టాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. ఇసుక ఉన్న రెండు టాక్టర్లను సీజ్ చేసి రూ.ఐదు వేలు అపరాధ రుసుం విధించారు.

సమగ్ర విచారణ చేపట్టాలి


కురుపాంలోని ఓ ప్రైవేటు క్లినిక్ వద్ద బాలికకు వైద్యం చేయిస్తున్న దృశ్యం(ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: అనారోగ్యం బారినపడిన మండలంలోని రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు.. ఆర్‌ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకువెళ్లారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్‌లు ఓ ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు. ఆరోగ్యం పరంగా ఇబ్బంది పడుతున్న బాలికలను మహిళా ఉపాధ్యాయులు గానీ, మహిళా వార్డెన్ గానీ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లాలి కానీ ఓ పురుష ఉపాధ్యాయుడు ప్రైవేటు ఆస్పత్రికి విద్యార్థినులను తీసుకువెళ్లడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

రేగిడిలోనే 24 గంటలూ సేవలందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా, కురుపాంలోని ఓ ప్రైవేట్ క్లినిక్ వద్దకు తీసుకువెళ్లి, అక్కడి ఆర్‌ఎంపీ డాక్టర్‌కు చూపించాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. చీకటి వేళలో 15 కిలోమీటర్ల దూరంలోని ఆస్పత్రికి పట్టుకుని వెళ్లడం పలు సందేహాలకు తావునిస్తోందన్నారు. ఈ ఘటనపై తక్షణమే మహిళా ఉన్నతాధికారులతో విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

వేతనదారులతో రాజకీయాలు

- సబ్ కలెక్టర్‌కు సర్పంచ్ ఫిర్యాదు


సబ్‌కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న సర్పంచ్ కళ్యాణి నాయుకులు, వేతనదారులు

పాలకొండ రూరల్: కూటమి నాయకులు ఉపాధి వేతనదారులతో రాజకీయం చేస్తున్నారని మండలంలోని చిన మంగళాపురం సర్పంచ్ గోగుల కళ్యాణి అన్నారు. బాధిత వేతనదారులతో కలసి సబ్‌కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డిని మంగళవారం కలసి వినతిపత్రం అదించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు గ్రామానికి చెందిన నాయకులు ఎన్ని బాబ్జీనాయుడు, బంకి సోంబాబు, ఎన్ని గోవిందు, పక్కి జోనాసి, దాసు తదితరులు మాట్లాడుతూ తమ గ్రామంలో 343 మంది ఉపాధి వేతనదారులున్నారు. గతంలో వారి అంగీకారంతో ఆరుగురు మేట్లును ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. దీంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాబ్ కార్డుదారులు పనులు చేసుకునేవారిని తెలిపారు. కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే ఏ సమస్య లేకున్నా సదరు మేట్లును నిబంధనలకు విరుద్ధంగా, వేతనదారుల తప్పుడు సంతకాలతో వారిని విధులకు దూరం చేశారన్నారు. వారి స్థానంలో రాజకీయం చేసి కొత్తవారికి అవకాశం కల్పించటంతో పాటు దశాబ్ద కాలంగా అనుభవం ఉన్న వారిని అన్యాయంగా తప్పించారన్నారు. కొత్తవారితో వేతనదారుల మధ్య గ్రూపులు ప్రోత్సహించటం, వారికి ఇష్టం వచ్చిన వారికే పనులు ఇవ్వటం, మిగిలిన వేతనదారుల పట్ల ఉద్దేశపూర్వకంగా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ఇదివరకే ఎంపీడీఓ, ఉపాధి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోటంతో సబ్‌కలెక్టర్ ఆశ్రయించినట్లు వివరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బంకి లక్ష్మణమూర్తి, గార బలరాంనాయుడు తదితరులు మాట్లాడుతూ స్థానిక అధికారులు కలుగజేసుకుని న్యాయం చేయాలన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

గుమ్మలక్ష్మీపురం: పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ కురుపాం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని విలేకరులతో మంగళవారం మాట్లాడారు. పలు దఫాలుగా పెట్రోలు, డీజిలు, వంటగ్యాస్‌ల ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచుతూ వస్తోందని, దీంతో సామాన్య ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పుడు కూడా వంటగ్యాస్‌పై మరో రూ.50 పెంచిందని, తక్షణమే పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని కోరారు.

కాయతొలుచు పురుగు నివారణ ఇలా..

పాలకొండ రూరల్: మామిడి పంటను ఏప్రిల్ నెలలో నష్టపరిచే పురుగుల నివారణకు డెల్టామిత్రిన్ 1మిల్లీలీటరు మరియూ కార్బండజిమ్, మాంకోజెబ్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలపి 1 నుంచి 15 రోజుల వ్యవధిలో మామిడి చెట్లకు పిచికారీ చేయాలని ఉద్యానవన అధికారిణి అమరేశ్వరి మంగళవారం సూచించారు. మండలంలో సింగుపురం, బద్దుమాసింగి తదితర గ్రామాల్లో జీడిమామిడి రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో బంక మందును కలిపి అందిస్తే మందు చెట్ల నుంచి జారిపోకుండా మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. తోటలో ఎండిన కొమ్మలు, ఆకులు తొలగించి వాటిని దగ్ధం చేయాలని సూచించారు. పురుగు ఆశించిన కాయలను చెట్టు నుంచి కోసి పురుగు ఇతర కాయలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలన్నారు.

చిరుధాన్యాల సాగుతో అదనపు ఆదాయం


శిక్షణ ఇస్తున్న వెలుగు సభ్యులు

సీతంపేట: చిరుధాన్యాల సాగుతో రైతులు అదనపు ఆదాయాన్ని సంపాదించవచ్చని వెలుగు రిసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం చిరుధాన్యాల పంటలు వేసిన రైతులకు అవగాహన కల్పించారు. వరి సాగు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించాలన్నారు. గుళిరాగి, జమున మోడల్ వేసి మంచి ఆదాయాలు పొందవచ్చన్నారు. అనంతరం ఐటీడీఏ ద్వారా గతంలో ఇచ్చిన మారిషస్ పైనాపిల్‌కు వేప పిండి, వేప నూనెలు పీహెచ్‌ఓ ఎస్‌వీ గణేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ గోపాలరావు

గరుగుబిల్లి: ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. మండలంలోని దళాయివలస, ఉద్దవోలు, శివరాంపురం గ్రామాల్లో మంగళవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి, ప్రజలకు పలు సూచనలు చేశారు. రోడ్లు, కాలువల్లో అనవసరంగా చెత్తాచెదారం వేయరాదని, ఇంట్లోని చెత్తను తడి, పొడి చెత్తలుగా వేరు చేసి, ఇంటి వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్‌లకు ఇవ్వాలని తెలిపారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీ చేస్తున్న ఫాస్టర్ ఫెలోషిప్ సభ్యులు, విశ్వాసకులు

పాలకొండ రూరల్: క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిలువరించి రక్షణ కల్పించాలని ఫాస్టర్ ఫెలోషిప్ బృంద సభ్యులు కోరారు. మంగళవారం ఫాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ, ఆయన మృతిలో చోటు చేసుకున్న అనుమానాలు నివృత్తి చేయాలంటూ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక యాలం కూడలి నుంచి వైఎస్సార్ కూడలి వరకు ర్యాలీ జరిగింది. ఐక్యంగా ఉన్న మతాలు, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే యత్నం ఏ ఒక్కరు చేయకూడదన్నారు. ఫాస్టర్ మృతి విషయంలో నిజ నిర్ధారణ జరిగేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాలకొండ పట్టణంలో గల క్రైస్తవ సంఘాలు, విశ్వాసకులు పాల్గొన్నారు.